క్లుప్తంగా

తుంపాలకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పరామర్శ

సబ్బవరం: అనారోగ్యంతో బాధపడుతున్న జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ తుంపాల అప్పారావును ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం పరామర్శించారు. సబ్బవరంలోని అనన్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా కొర్లయ్య



పరవాడ: సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ కార్యదర్శిగా, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జిగా ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన సీహెచ్.కొర్లయ్యను నియమిస్తూ సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనను ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు శంకరయ్యకు కొర్లయ్య కృతజ్ఞతలు తెలిపారు.

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ఆందోళన



దేశపాత్రునిపాలెం సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పరవాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని అనకాపల్లి జిల్లా సీపీఎం కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. అధిక ధరలకు నిరసనగా దేశపాత్రునిపాలెం సచివాలయం ఎదుట శుక్రవారం సీపీఎం కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల సామాన్యులపై భారం పడిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.వి.రమణ, పి.మాణిక్యం, గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



అదృశ్యమైన జయకిరణ్

పరవాడ: మండలంలో ఈదులపాక బోనంగి గ్రామానికి చెందిన జయకిరణ్(14),హరికిరణ్(10) అనే విద్యార్థులు గత నెల 31న అదృశ్యమయ్యారని నడింపల్లి సత్యనారాయణ పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుకు సంబంధించి సీఐ పి.ఈశ్వరరావు అందించిన వివరాలు. ఈ. బోనంగి గ్రామానికి చెందిన నడింపల్లి సత్యనారాయణ తమ్ముడు కుమారులైన జయకిరణ్, హరికిరణ్‌లను కూర్మన్నపాలెంలోని చైతన్య పాఠశాలలో చదివిస్తున్నాడు. జయకిరణ్ 9వ తరగతి చదువుతుండగా.. హరికిరణ్ 8వ తరగతి చదువుతున్నాడు. వీరివురూ గత నెల 31న సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చి దుస్తులు మార్చుకున్నారు. టాయిలెట్‌కు వెళ్లి వస్తామని చెప్పి రాత్రి 7 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన అన్నదమ్ములిద్దరూ తిరిగా రాకపోవడంతో కంగారు పడి చుట్టు పక్కల గాలించినా కనిపించలేదు. అయితే హరికిరణ్ యలమంచిలి వద్ద శుక్రవారం దొరికాడు. జయ కిరణ్ ఆచూకీ కోసం గాలింపు చేపట్టాలని విద్యార్థుల పెదనాన్న సత్యనారాయణ ఫిర్యాదు చేశారని సీఐ ఈశ్వరరావు తెలిపారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందజేశారు. నిత్యకల్యాణం పాల్గొనే భక్తులు ఆన్‌లైన్, సింహగిరిపై ఉన్న మేఘ హెల్ప్‌యు కేంద్రంలో కూడా టికెట్‌లు పొందవచ్చని అర్చకులు తెలిపారు.

అభివృద్ధి పనుల వేగవంతం

పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలో ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర



పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర, చిత్రంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

తుమ్మపాల: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలో ఆయనతో పాటు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌లు పాల్గొని అధికారులతో పలు అభివృద్ధి పనుల ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై క్షేత్ర స్థాయిలో అధికారులు దృష్టి సారించి అభివృద్ధి పనుల పురోగతిని పెంచాలన్నారు. అపరిష్కృత సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేపట్టారని, ఎక్కడైనా లోటుపాట్లుంటే వాటిని సరిదిద్దేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కూడా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు. వివిధ శాఖల పనులపై అధికారులతో కలిసి ప్రొగ్రెస్ నివేదికను కలెక్టర్ వివరించారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్య పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే పరిధిలో ఎలాంటి సమస్యలున్నా తక్షణమే పరిష్కరిస్తున్నామన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు శతశాతం చేరేలా అధికారులు మరింత కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని సబ్బవరం, పరవాడ మండలాల్లో జగనన్న కాలనీలు, తాగునీరు, రోడ్లు తదితర అభివృద్ధి పనులపై క్షుణ్ణంగా సమీక్షించారు. కొన్ని జగనన్న కాలనీల్లో కోర్టు కేసులు పనుల పూర్తికి ఆటంకంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. వాటిపై కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటానని భరోసానిచ్చారు. మిగిలిన కాలనీల్లో అప్రోచ్ రోడ్లను, విద్యుత్ సౌకర్యాలను పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సబ్బవరంలో క్రైస్తవుల శ్మశానం కోసం స్థల పరిశీలన జరిపి, వేగంగా కేటాయించాలని అధికారులను ఎమ్మెల్యే సూచించారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి డి.అనిత, జిల్లా ప్రణాళిక అధికారి జి.రామారావు, డ్వామా పీడీ సందీప్, డీఎఫ్‌వో జి.లక్ష్మణ్, ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు, ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



96వ వార్డులో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. 96వ వార్డు 520 సచివాలయం పరిధి దొగ్గవానిపాలెం,రైల్వేస్టేషన్‌రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత ఉండి సంక్షేమ పథకం అందకపోతే అందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసి జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని చెప్పారు. తాము చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమంతో నేడు ప్రతీ ఇంటికి వెళ్లగలుగుతున్నామన్నారు. ప్రతీ గడపలోనూ బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. అవినీతికి తావులేకుండా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించి పాలనలో సీఎం వైఎస్ జగన్ నూతన శకానికి నాంది పలికారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిరికి దేముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె రామునాయుడు, శరగడం నర్సింహమూర్తి, లెక్కల రమేష్, దాడి ఉమామహేష్, కిల్లి అప్పారావు, అల్లం అప్పారావు, రొంగలి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతికి ఏర్పాట్లు

పరవాడ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని పరవాడ సంతబయలులో శనివారం ఉదయం 8.30 గంటలకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు తెలిపారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తారన్నారు. మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు శంకరరావు జయంతి

సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు, దివంగత ఆత్మకూరి శంకరరావు 92వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు శుక్రవార ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థలు, విజన్ కేంద్రాలు, మూడు జిల్లాల్లోని గ్రామాల్లో నిరుపేదలకు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి శంకర్ ఫౌండేషన్‌కు వెన్నుగా నిలిచిన వారి సత్కరించనున్నట్టు పేర్కొన్నారు.

స్కూల్ బస్ ఢీకొని వృద్ధుడి మృతి



ఈశ్వరరావు (ఫైల్)

సబ్బవరం: మండలంలోని సబ్బవరం–చోడవరం రోడ్డులోని ఆరిపాక సమీపంలో చెరుకు కాటా వద్ద స్కూల్ బస్ ఢీకొన్న ఘటనలో వృద్ధుడితో పాటు ఆవు మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిపాక గ్రామానికి చెందిన వృద్ధుడు దాసుబిల్లి ఈశ్వరరావు(65) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నారు. కొన్నేళ్ల కిందట భార్య మృతి చెందడంతో ఆవును మేపుతూ సోదరి వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. సోదరి ఆరిపాక సమీపంలోని టిక్కలిపాలెం జంక్షన్ వద్ద నివాసం ఉంటుంది. మృతుడు ఈశ్వరరావు శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో భోజనం చేసి ఆవును తీసుకొని చెరుకు కాటా సమీపంలోని పాక దగ్గరకు వెళ్తున్నాడు. కాటా వద్ద రోడ్డు దాటుతుండగా అదే సమయంలో చోడవరం వైపు నుంచి విశాఖవైపు పెళ్లి వారిని తీసుకుని వెళుతున్న స్కూల్ బస్సు ఢీ కొట్టింది. ఈశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడే మృతి చెందాడు. పాడి ఆవుకు కూడా మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి సీఐ రంగనాథం,ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి కుమారుడు విదేశాల్లో ఉండగా, కుమార్తె ఉన్నారు.

తిక్కవానిపాలెం తీరానికి చేరిన మృతదేహం

- వేటకు వెళ్లి గత నెల 25న గల్లంతు
- మృతుడి వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన మారుపల్లి అప్పన్నగా గుర్తింపు

పరవాడ: మండలంలోని తిక్కవానిపాలెం తీరంలో గుర్తు తెలియని మృతదేహన్ని స్థానికులు శుక్రవారం గుర్తించి పరవాడ పోలీసులకు సమాచారం అందించారు. ఆ మృతదేహం విశాఖ వన్‌టౌన్ ఏవీఎన్ కళాశాల ఏరియాకు చెందిన మారుపల్లి అప్పన్న(26)గా గుర్తించారు. సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాలు.. విశాఖ వన్‌టౌన్ ఏరియాకు చెందిన మారుపల్లి అప్పన్న మరికొంత మందితో కలిసి గత నెల 21న తెల్లవారు జామున 4.30 గంటల ప్రాంతంలో ఫిషింగ్ హర్బర్ నుంచి బోటుపై చేపల వేటకు బయలుదేరి వెళ్లారు. కాగా గత నెల 25న మారుపల్లి అప్పన్న ప్రమాదవశాత్తు సముద్రంలో పడిపోయాడు. తోటి వేటగాళ్లు ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో వెనుదిరిగారు. మెరైన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలో అప్పన్న మృతదేహం శుక్రవారం మధ్యాహ్నం తిక్కవానిపాలెం తీరానికి కొట్టుకు వచ్చింది. సమాచారాన్ని పోలీసులు మృతుడి బంధువులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

ఘనంగా ఎస్‌బీఐ యూనియన్ వార్షికోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న సబ్బవరం స్టేట్ బ్యాంకు శాఖ సిబ్బంది

సబ్బవరం:స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాయూనియన్ ఐదో వార్షికోత్సవాన్ని సబ్బవరం శాఖ సిబ్బంది శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సబ్బవరం శాఖ పనిచేస్తున్న సిబ్బంది స్టేట్ బ్యాంకు నుంచి మూడు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వై. తారక్ నాథ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనకాపల్లి రీజియన్ రీజనల్ కార్యదర్శి పైలా ప్రసాదరావు మాట్లాడుతూ స్టేట్ బ్యాంకులోని సిబ్బంది అభ్యున్నతికి యూనియన్ నాయకులు విశిష్ట సేవలు అందిచారన్నారు. కార్యక్రమంలో భాగంగా ఖాతాదారులకు ఆహారం,మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దలు చిరంజీవి రాజు,సత్యనారాయణ,చిన రమణ, బ్రాంచి మేనేజర్ త్రినాథరావు,లోకల్ కార్యదర్శి మురళీ తదితరులు పాల్గొన్నారు.

పండగలా నూతన పింఛన్ల పంపిణీ



93వ వార్డులో పింఛన్లు అందజేస్తున్న దాసరి అన్నపూర్ణ తదితరులు



95వ వార్డులో కొత్త పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు



97వ వార్డులో కొత్త పింఛన్ అందిస్తున్న వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్



పురుషోత్తపురంలో పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్లు చందు యాదవ్, శ్రీను తదితరులు

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు 491,489,493,525 సచివాలయాల పరిధిలో కొత్తగా మంజూరైన 22 ఫించన్లను శుక్రవారం వారు వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి అన్నపూర్ణ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 94వవార్డు అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, పార్టీ నాయకులు దాసరి సత్తిబాబు, అడ్డాల రామరాజు, కార్తీక్‌వర్మ, బండి సత్తిబాబు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 95వ వార్డులోని 501 సచివాలయం పరిధిలోని లక్ష్మీపురం, గవరపాలెం ఏరియాల్లోని కొత్తగా 18 పింఛన్లు మంజూరయ్యాయి. వాటిని కార్పొరేటర్ ముమ్మన దేముడు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జేసీఎస్ ఇన్‌చార్జి జోబ్‌దాస్, యువజన విభాగం అధ్యక్షుడు చిప్పల చందు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.
- 97వవార్డు 508 సచివాలయం చాణక్యనగర్‌లో కొత్తగా 11 మందికి ఫించన్లు మంజూరు కాగా వాటిని వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ అందజేశారు.

విజయవంతంగా 'నా మట్టి–నాదేశం'



ఓ వృద్ధురాలి నుంచి మట్టి సేకరిస్తున్న రామునాయుడు తదితరులు

సింహాచలం: పెందుర్తి మండలం గొరపల్లి, గవరపాలెం గ్రామాల్లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో నా మట్టి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సూచనల మేరకు మేరీ మట్టి–మేరాదేశ్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కంచిపాటి సన్యాసిరావు, ఓబీసీ జనరల్ సెక్రటరీ ఎర్ర అచ్చంనాయుడు, పెందుర్తి రూరల్ మండల అధ్యక్షుడు కాళ్ల జగన్‌మోహన్, నాయకులు లక్ష్మణరావు, త్రివిక్రమ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

పరవాడ: అండర్ వాటర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యూఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 5 వరకు పూణేలో జరగనున్న మూడో నేషనల్ ఫిన్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు ఎంపిక య్యారని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు చెప్పారు. నేషనల్ ఫిన్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలకు పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి, కోచ్‌లు మనీష్, బషీర్, రాజేష్ ఆకాంక్షించారు.

టీడీపీ కార్పొరేటర్ భర్త భూ బాగోతం!

- రూ.5 కోట్లు విలువ చేసే గెడ్డ స్థలం కబ్జా
- దర్జాగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- అందులోనే టీడీపీ 97వ వార్డు కార్యాలయం ఏర్పాటు
- ప్రభుత్వ భూమి కాపాడాలని తహసీల్దార్‌కు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఫిర్యాదు



ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన టీడీపీ 97వ వార్డు కార్యాలయం



గెడ్డ స్థలం ఆక్రమించి నిర్మించారని ఫిర్యాదు చేసిన షాపింగ్ కాంప్లెక్ ఇదే..

సింహాచలం: టీడీపీ కార్పొరేటర్ భర్త భూబాగోతం వెలుగులోకి వచ్చింది. జీవీఎంసీ 97వ వార్డు పరిధి చినముషిడివాడలోని సర్వే నంబర్ 93లో సుమారు 500 గజాల గెడ్డ స్థలం ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు వార్డు టీడీపీ కార్యాలయం కూడా ఏర్పాటు చేశారని పెందుర్తి తహసీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు అందింది.

కార్పొరేటర్ ముమ్మన దేముడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు..

దాదాపు రూ.5 కోట్లు విలువైన గెడ్డ స్థలాన్ని 97వవార్డు టీడీపీ నేత శానాపతి శంకరరావు ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పెందుర్తి తహసీల్దార్‌కు శుక్రవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. 97వవార్డు పరిధి చినముషిడివాలోని సర్వేనెంబర్ 93లో సుమారు 500 గజాల రెవెన్యూ గెడ్డ స్థలం ఉంది. ఆ స్థలం విలువ దాదాపు రూ.5 కోట్లు ఉంటుంది. ఆ స్థలాన్ని ఆక్రమించి 97వవార్డు టీడీపీ నాయకుడు శానాపతి శంకరరావు(97వవార్డు (కార్పొరేటర్ శానాపతి వసంత భర్త) షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. అలాగే కొంత స్థలంలో వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. వాణిజ్య సముదాయంలోని షాపుల ద్వారా నెలకు దాదాపు రూ.లక్ష వరకు అద్దె వసూలు చేస్తున్నారు. గెడ్డ ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా ఉండడంపై పెద్ద మొత్తంలో చేతులు మారినట్టు ఆరోపణలు వస్తున్నాయి. కాగా నిర్మాణ సమయంలో రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు పలుమార్లు అడ్డుకున్నా శానాపతి శంకరరావు తన పలుకుబడితో అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి నిర్మాణం పూర్తిచేయడంపై కూడా తీవ్ర విమర్శలు ఉన్నాయి. వెంటనే రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు సంబంధిత షాపింగ్ కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ముమ్మన దేముడు కోరారు. ఈ విషయంపై తాము ఎంతవరకైనా పోరాడుతామని ముమ్మన స్పష్టం చేశారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు భరోసా



లబ్ధిదారులకు పింఛన్లతో పాటు జంబో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం:అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి వారి సంపూర్ణ మద్దతు లభిస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా శుక్రవారం నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా ఇస్తున్న సీఎం వైఎస్ జగన్ వారి మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. తమ ప్రభుత్వ అధికారం చేపట్టే నాటికి మండలంలో 6,918 పింఛన్లు ఉండేవని ప్రస్తుతం ఆ సంఖ్య 8,005 మందికి చేరిందన్నారు. వాటికి అదనంగా మరో 367 మందికి పింఛన్లు మంజూరు కావడంతో 8,372 మందికి పింఛన్లు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పింఛన్లకు సంబంధించిన జంబో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జేసీఎస్ మండల కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీడీవో రమేష్ నాయుడు,తహసీల్దార్ సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు ముత్యాల నాయుడు,వనం అచ్చెంనాయుడు,బైలపూడి దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు జన్మదిన వేడుకల్లో భాగంగా సబ్బవరంలోని ఆయన స్వగృహంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు జన్మదినం పురస్కరించుకుని ఎమ్మెల్యే కర్రిబాబు,యడ్ల నాయుడులను సత్కరించి చిత్రపటాలు అందజేశారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు



సింహవల్లీ తాయారు అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని అడవివరం, పెందుర్తిలోని పలు ఆలయాల్లో విశేషంగా పూజలు నిర్వహించారు. లక్ష్మీదేవి నామస్మరణలో మహిళలు మునిగితేలారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి వేదికపై అధిష్టంపజేసి భక్తుల గోత్రనామాలతో కుంకుమపూజ చేశారు.

– అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మతల్లి ఆలయంలో సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

- 97వ వార్డు సుజాతనగర్ దరి సప్తగిరినగర్ కాలనీ ఉన్న అలివేలు మంగాదేవి ఆలయంలో ఉదయం 10 గంటలకు సామూహిక కుంకుమార్చన, లక్ష్మీదేవిపూజ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి సారె మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.
- 97వ వార్డు సుజాతనగర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో లక్ష్మీదేవికి సహస్రనామార్చన పూజ చేశారు.
- పెందుర్తి మండలం రాంపురంలోని రమాసహిత సత్యనారాయణస్వామి, సంతోషిమాత ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు విశేషంగా నిర్వహించారు.

సింహగిరిపై లక్ష కుంకుమార్చన

సింహచలం: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన ఘనంగా జరిగింది. ఉదయం7నుంచి 9గంటల నుంచి అర్చకులు పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు.సింహవల్లీ తాయారు అమ్మవారి ప్రతినిధులుగా సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను సింహాసనంపై అధిష్టంపజేశారు. పదిమంది అర్చకులు కుంకుమపూజ నిర్వహించారు. భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలు, కుంకుమ ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు చక్రవర్తి తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు చేశారు.

ఘనంగా తిరువీధి

సింహవల్లీ తాయారు సన్నిధిలో సహస్రనమార్చాన విశేషంగా నిర్వహించారు. 1001నామాలను పఠిస్తూ భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో అధిష్టంపజేసి ఆలయ మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు.